# అంకెలా - సంఖ్యలా

శ్రీ ద్రావ్విడి అన్నంరాజుశర్మ

సభికులందరూ ఆసీనులైవున్న హాల్లో ఎత్తుగానున్న గోడగడియారంలో అయిదు గంటల పదినిమిషాలైంది. చల్లని మనోహరమైన సాయంత్రం. అంత వరకూ సందడిగానూ, కోలాహలంగానూ వున్న హాలు ఆవరణంతా అదే సమయానికి నిశ్శబ్దాన్నవలంబించింది. కళాకాంతులు ముఖంలో వుట్టిపడుతూన్న వృద్ధుడొకడు లేచినిలబడి గొంతు సవరించుకున్నాడు.

"ఈ నాడు చాలా పర్వదినం. సంఘసంస్కరణాభిలాషాపరులు, జగమెరిగిన బ్రాహ్మణులు, వితంతు వివాహాలపై స్వచ్ఛమైన అభిప్రాయాలు కలిగి, సమాజంలోని వొడుదుడుకుల్ని తీవ్రంగా నిరశిస్తూ నిజకర్తవ్యంఎరిగి ముందంజవేస్తూన్న రాజశేఖరరావుగారు - లోకం ఆయన్ని రాజయ్యగారని పిలుస్తుంది - రాజయ్యగారు ... వారి షష్టిపూర్తి మహోత్సవానికి నేను అధ్యక్షపదవి నలంకరించవలసి వచ్చినందుకు యీ మహోత్సవం మా భవనంలో జరగడం సంభవించినందుకు నేను గర్విస్తున్నాను. రాజయ్యగారు నిష్కల్మషమైన, స్వచ్ఛందమైన దేశసేవాపరాయణులు. వారి సముఖంలో వారిని పొగిడి సిగ్గిల చేస్తూన్నందుకు క్షంతవ్యుడ్ని. వారి వుదార స్వభావాన్ని, సరస సద్గుణ సంపన్నతనూ ఎరుగనివారు అరుదు. ఏమారుమూల దేశంలో అయినా సరే, ఎంతదూర ప్రాంతం అయినా సరే ఏవ్యక్తిగానీ అనాథగా, అసహాయగా ఆర్తనాదం గావించిందంటే వారి కోమల హృదయం సంక్షుభితమై కన్నీరు విడుస్తుంది. అట్టి సమయంలో వారి అపార దయారసం కట్టలుతెగి, పరిధులుదాటి ప్రవహిస్తుంది. బంధు సంబంధంగా వారు ఏకాకి. కాని మిత్రసంబంధంగా అందరూ అందుకోగల దగ్గర వస్తువు. ఈ మధ్యలో వెలసిన ఏ అనాథ, వితంతు శరణాలయాలు వారి సహృదయం సమర్పించి అఖండ విరాళాలతో ఉక్కిరి బిక్కిరి కాకుండాపోలేదు. ఆయన సహాయం బడసిన అనేకులు, జీవితమంతా అంధకార బంధురమని భావించి నిరాశాపరులై తిరిగి వారి కటాక్ష వీక్షణంపైబడి, 'జీవితం ఆత్మహత్యకు కాదు, ఆత్మ పరీక్షకు' అని నిరూపించుకున్న ఆ నాటి అభాగినులు, వారిచే పోషింపబడుతూవున్న శరణాలయాలలోని యువతులు వందలకు వందలు నేడిక్కడ సమావేశం కావటం నా కన్నుల పండువుగావుంది. అదిగో కమల! రాజయ్యగారి ప్రాణం, వారి పెంపుడు కుమార్తె. వారి అపూర్వ కరుణామయమైన మనస్సు విరజిమ్మె లాలిత్యంభరించలేక కన్నీరు విడుస్తోంది. ఈ అమోఘమైన సంఘటన చాలదా ఎవరిగుండెనైనా ద్రవింపచేయుటానికి? ఇంక నేనేమని చెప్పను? వారిని ఏదయినా పొగిడి చికాకుపరిచినట్లయితే మళ్ళీ ఓసారి క్షమించమని ప్రార్థిస్తూ, యింతకంటే పొడిగించటానికి గద్గదమైవున్న నా కంఠం పనికిరావటంలేదని విన్నవించుకుంటూ నా మాటల్లో ఏదయినా అపచారంచేసినట్లయితే యీ అపరాధాన్ని మన్నించమని వేడుకుంటూ యింతటితో విరమిస్తున్నాను."

కరతాళ ధ్వనులు చెలరేగాయి. అందులో ఎక్కువభాగం అబలల ఆక్రందనలకు మారుపేరైన-నవనీత మనస్కులు చేసిన శబ్దసమూహాలు.

వృద్ధుడు కూర్చున్నాడు. సభాస్థితి తిరిగి నిశ్శబ్దం వహించింది. కొన్నివందలమంది సుఖంగా ఆసీనులు కాగలిగిన విశాలమైన హాలు అది. ఇటువంటి ఉజ్వలమైన ప్రయోజనాలకోసమే నిర్మించబడినదా అని భ్రమకలిగిస్తోంది. రాజయ్యగారు తలవంచుకుని వినయ విధేయతలతో కూర్చున్నాడు. ఒకసారి

తలఎత్తి అందరి ముఖాలవంకా ప్రశాంతమైన చిరునవ్వు వెలుగుతున్న వదనంతో వీక్షించాడు. సర్వత్రా నిశ్శబ్దం తాండవిస్తోంది. బాధలు, కష్టాలు స్ఫుటంగా, ముఖాలలో ముద్రితమైవున్న మహిళలందరూ ఒక్కుమ్మడి వేదనతో నిట్టూర్పు విడిచినట్లు, లేక ఆ శబ్దాన్ని మరుగుపరుస్తూనో అందమైన గోడమీద గడియారం అరగంట కొట్టింది. సుదూరంలో కూర్చుని తండ్రిగారివంక అత్యంత శ్రద్ధాభక్తులతో తిలకిస్తూన్న కమల చప్పున విచలిత హృదయురాలైంది. ఆవేదనా భరితమైన కమల కోమల హృదయం తిరిగి ఒకింత చలించి, అది ఆర్ద్రతను వారించుమని ఏదో కన్నీరుగా నేత్రాలనుంచి బయటకు పాయలుగా స్రవిస్తూన్న అనురాగరసాన్ని తుడుచుకోవటానికి లజ్జితురాలై, గంభీరతను నింపుకుని తండ్రిచేసిన మందహాసం గుండెను కెలికినట్లు కాగా పూర్తిగా బాహ్యస్మృతిలోకి ప్రవేశించి తన తప్పును తెలుసుకుని చేతిరుమాలతో వాటిని మెల్లమెల్లగా తుడిచివేసింది. ఇది యిప్పుడు కలకాదు; నిజంఅన్న సంగతి గుర్తించింది. అధ్యక్షుడు తనని గురించి పలికిన పలుకులు యదార్థానికి సంబంధించినవేకాక, తనలో నిగ్గుమాలినతనం రేకెత్తించబడిన విషయం విస్మరింపచేశాయి. ఇంత సానుభూతి భరించటం ఎంత కష్టమో. ఇప్పుడు విన్నదాంట్లో అతిశయోక్తి ఏమీలేదు. "నాన్నా"! అని మనసారా అభివందనంచేయాలని సంకల్పించిన మనసు చేసిన వొత్తిడికి తట్టుకోలేక "అయ్యో!" అని నిట్టూర్చి, కొద్దిగా జరిగి, దిటవుచేసుకుని కూర్చుని ఆయనవంక సాభిప్రాయంగా చూసింది.

అధ్యక్షుడు లేచినిల్చున్నాడు. మధురమైన తన కంఠం సవరించుకుని యిలా అన్నాడు. "రాజయ్యగారిని మాట్లాడమని కోరుతున్నాను!"

రాజయ్యగారు నిశ్శబ్దంగా లేచినిలబడ్డాడు. ఒకసారి నలుపంకెలా పరికించాడు. తృప్తితో ఆయన నేత్రాలు ప్రకాశించినవి. మెల్లగా పెదాలు కదలాయి.

"మిత్రులారా!" అని సంభోదించాడు. గొంతు వొణికింది. సభయావత్తూ కంపించినట్లయింది. నిర్మలతలో ఎంతటి నిగూఢమైన శక్తివుంది!

"ఇవాళ ఎంత సుదినం! నాకు షష్టి పూర్తి మహోత్సవం జరుగుతున్నందుకుకాదు. అసలు అది ముఖ్యమైన సంగతి కానేకాదు. ఇదిగో! ఈ తెరలచాటున అమర్చివున్న చిత్రపటంవంక తిలకించారా! ఇది నాదేనని మీరు అనుకుంటున్నారుకదూ! కాదు. ఈ నాడు జరగవలసిన కార్యక్రమంలో ముఖ్య ఘట్టం నాకు సంబంధించినది కాదు. ముందు ... ఒకమాట చెబుతున్నా_ఆలకించండి. అధ్యక్ష మహాశయులు నన్ను కరుణామయునిగా, ఉదార స్వభావునిగా కీర్తించారు. ఇప్పటి నా నిజరూపం నాకు తెలియదని విన్నవించుకుంటున్నాను. పదిసంవత్సరాలక్రితం యీ వూళ్లోనే రాజశేఖరం అంటూ ఒక వ్యక్తి వుండేవాడు. వాడు పాషాణుడు, రాక్షసుడు, క్రూరుడు, దుర్మార్గుడు. అట్టి మనిషిని మీరందరూ యిప్పుడనుకుంటున్న విధంగా తయారుచేసినదెవరో తెలుసునా? అధ్యక్ష మహాశయుల్ని యీ చిత్రపటం ఆవిష్కరించవలసినదిగా కోరుకుంటున్నాను."

అధ్యక్షుడు ఏదోచెప్పి వారించబోయాడు. కాని సన్మానితుడు విన్పించుకునే స్థితిలోలేడు. ఒక క్షణం సభలో కలవరంబయల్దేరింది. అధ్యక్షుడు లేచి పటాన్ని సమీపిస్తున్నాడు. గొడవఅంతా చప్పున మాటుమణిగింది. ప్రతి వ్యక్తీ ఊపిరి బిగించి, రెప్పవాల్చక చూస్తున్నాడు. చూస్తున్న చిత్రపటం ఆవిష్కరించబడింది.

"ఉత్తమ యిల్లాలు, మహాసాధ్వి. ఈమె గుణగణాలను కీర్తించే అర్హత నాకులేదు. ఈమె నా తనయ"

సభలో చిన్న కోలాహలం జనించి, మళ్ళీ వెంటనే అంతరించిపోయింది.

"బహుశా మీలో చాలామంది ఎరిగివుండక

పోవచ్చు. ఏనాడూ యింటివాకిలిదాటి, బయటి ప్రపంచంచూసి ఎరుగని ఆమె నైజగుణమే అందుకు కారణం అని చెప్పటానికి నేను ... గ ... గర్విస్తున్నాను. దౌర్భాగ్యుడినై విలపిస్తున్నాను. తల్లీ కమల! ఆమె నీ అక్క, అలా చూడు ఆ పవిత్ర మూర్తిని.”

ఆశ్చర్యంతోనూ, దుఃఖంతోనూ కమల చకితురాలైంది. చిత్రంలోని అమాయక సుందరరూపం వంక తదేకంగా చూడసాగింది. జాలితో కన్నీళ్ళు జారాయి.

“అప్పుడామె పద్ధెనిమిది సంవత్సరాల, పసిడి నిగ్గులు తేలి యవ్వనంలోవున్న యువతి. ఇది పది సంవత్సరాలకి పూర్వం జరిగిన సంఘటన. జాగ్రత్తగా ఆలకిస్తే నా దైన్యానికి కారణం విపులీకరించగలుగుతాను. ఆమె పేరు అరవింద. అరవింద నా కుమార్తె. తల్లిలేనిపిల్ల అయింది బాల్యంలోనే. నా భార్య యీ చిట్టితల్లిని నా చేతుల్లోపెట్టి శలవు తీసుకుంది. నా ప్రాణానికి ప్రాణంగా అరవిందను పెంచలేకపోయిన పాపిష్టిని. దాసీలే, అడపా తడపా మా యింటికి వచ్చే బంధువులే పెంచి పెద్దదాన్ని చేశారు. ఆమెలోని అమాయకత్వం చిందించే వెన్నెలను తండ్రిఅయికూడా అనుభవించలేని మనిషిని మృగం అని పిలవాలి. ఆమె అలాగే తలిదండ్రుల ప్రేమ లోపించి పెరుగుతూంటే—నేనో—? విచ్చలవిడిగా నా దారిన తిరుగుతూండేవాడిని. నా డబ్బును ఆనందంగా మార్చుకున్నాను. బంధువుల బలవంతం వల్ల అరవింద పధ్నాలుగో ఏట ఏదో పెళ్ళి అయిందనిపించాను. కాపురానికి వెళ్ళిపోయింది కొద్దిరోజుల్లోనే. నా గుండె ఎంత కఠినమైనదో మీరు దీనినిబట్టే ఊహించుకోవచ్చు. అత్తవారింటికి వెళ్ళిపోయాక ఆమె వర్తమానం ఏమీ తెలుసుకోవటానికి నేను అల్పప్రయత్నంకూడాచేయలేదు. పుట్టి, బుద్ధెరిగాక నా వద్దకువచ్చి “నాన్నా! నాకు అది కావాలి, యిది కావాలి” అని గారాబంచేసి ఎరుగదుకదా - ఎప్పుడన్నా నేనున్నగదిలోకి అడుగు పెడితేనే “పో అవతలకు” అని కసురుకునేవాడిని. అటువంటి నా దగ్గరకు తనంతట రా ఏ కుమార్తె సాహసిస్తుంది? అప్పుడు బంధువులు కొంతమంది నా దగ్గరకువచ్చి అరవిందను ఆమె పెనిమిటి చాలా కష్టాలపాలు చేస్తున్నాడనీ, చిత్రహింస సాగిస్తున్నాడనీ, అతడు వట్టి మూర్ఖుడనీ చెప్పేవాళ్ళు. నేను నిర్లక్ష్యంతో వినీ విననట్లు ఊరుకునేవాడిని. ఇలా రెండు సంవత్సరాలు గడిచిపోయాయి. బంధువులు వచ్చి అల్లుడి విషయం తేల్చుకొమ్మని ఎన్నిసార్లో బోధించటం జరిగింది. నేనేమీ లెక్కచెయ్యలేదు. అరవింద లేకలేక పుట్టినపిల్ల అన్న జ్ఞానంకూడా నాకు లేకపోయింది.”

“ఓ, రోజు ఉదయం అప్పుడే నిద్రలేచాను. అంతవరకూ నాకు నిద్రాభంగంచేయడానికి వెరుస్తూ, సమీపంలో తారట్లాడుతున్న నౌఖర్లు పరిగెత్తుకువచ్చి అమ్మాయిగారు వచ్చారని చెప్పారు. నేను విస్తుపోయి “అమ్మాయిగారెవర్రా?” అనడిగాను. “అరవిందమ్మగారండి?” ఓహ్! నా కూతురు వుందన్నమాట. అని మందమతితనమా? అహంభావమా? ... అమ్మాయిని సమీపించాను. ఒక మూల దీనవదనంతో నిలబడివుంది. పుట్టెడు దుఃఖంతో నా వంక చూసింది. పుట్టాక ఆమె కళ్లు అంత ఎర్రబడివుండటము చూడలేదు. అయినప్పటికీ నాకేమీ బాధ అనుపించలేదు. “ఏం?” అన్నాను మోటుగా. ‘నాన్నా!’ అంది గాద్గదిక కంఠంతో. ఇదేమిటి? నన్ను ‘నాన్నా!’ అని పిలిచేవారుకూడా వున్నారా ఏమిటి? “వారు పోయారు నాన్నా!” అని బావురుమంటూ నేల మీద వాలిపోయింది. “అయ్యో పాపం” అనుకున్నాను. ‘ఈమె నా కూతురు-దగ్గరకు తీసుకుని లాలించాలి, బుజ్జగించాలి’ అని నాకేం తెలియదు. ‘ఏం జబ్బు?’ అనడిగాను అలా మొద్దులా నిలబడి చూస్తూ. ఏడుస్తూ అలానే పడుకునివుంది. నాకు జాలికలిగింది. “సరే, జరిగిందేదో జరిగింది. ఏం చేస్తాం? ఇక్కడ నీకు వచ్చినలోటు ఏమీలేదు లోపలికిపద. ముఖం కడుక్కుని కాఫీత్రాగు” అ

అక్కడినుంచి కదలి లోపలకు వెళ్ళాను. నాకు వరుసకు చెల్లెలు, అమంగళి అయిన ఒకామె మా యింట్లోనే తింటూవుంటుంది. వెళ్ళి వ్యవహారం చూడమని ఆమెను సాగనంపి నేను నా పనుల్లో నిమగ్నుడైపోయాను."

రాజయ్యగారు ఓ క్షణం ఆగి తడబడుతున్న చూపుల్తో చుట్టూరా ఓ సారి కలయజూశాడు. కొన్నివందల కళ్ళు సాభిప్రాయంగా ఆయన్ని పరికిస్తున్నాయి. శ్రద్ధాభక్తులతో ఆలకిస్తున్నారు అది కథ కాదు ఉపన్యాసం అని మరిచి. నెమ్మదిగా కొనసాగించాడు.

"ఇలా రోజులు, వారాలు, నెలలు ఒకటి ... రెండు సంవత్సరాలు గడిచిపోతున్నాయి. నా కార్యక్రమానికేమీ అడ్డులేదు. భర్తను కోల్పోయి వచ్చి, అహర్నిశాలూ దిగులుతో కుమిలిపోతూన్న కూతురు యింట్లోవున్నదన్న సంగతి నా విస్మృతిలో పడిపోయింది. ఇదివరకు ఆమె మంచీ చెడూ నేను పట్టించుకోలేదు. ఇప్పుడూ అంతే. వారానికి పది రోజులకూ ఓ సారి నా కళ్లబడేదేమో. ఏ సమయంలో ఏంచేస్తోందో, ఏ మూలవుంటుందోకూడా నాకేం తెలియదు. ఇదివరకు యిక్కడ వుండగా ఎప్పుడోగాని వాకిట్లోకి వెళ్ళఎరుగదు. ఇప్పుడూ అంతే. అప్పుడప్పుడూ నా వరుస చెల్లెలు నా దగ్గరకువచ్చి ఏమేమో మొత్తుకునేది. 'అరవింద అన్నెమూ, పున్నెమూ ఎరుగని అమాయకురాలనీ, ఆ పెళ్ళిచేసేముందు వాడంటే ఆమెకు యిష్టంవుందో లేదో నేనసలు కనుక్కోలేదని, ఆ దౌర్భాగ్యుడితో కాపురంచేసినన్నాళ్లూ కష్టంతప్ప సుఖం అన్నది ఎరుగదనీ' కొంచం ఆగి చాలా అవస్థపడి, ఎంతో తటపటాయించి, చివరకు తెగించి "ఈ రోజుల్లో మళ్ళీ పెళ్ళిచేయటం ఏమితప్పు? ఎందరెందరు చేసుకోవటంల్లేదు?"

'గంగమ్మా' అని అరిచాను వళ్ళు తెలియని కోపంతో. 'ఇంత పెద్దదానవు. లోకం తెలిసిన దానవు. ఈ సలహా చెప్పటానికి నీకు సిగ్గు ఎలా లేకపోయిందమ్మా!'

"సిగ్గు ఎందుకు అన్నయ్యా? నాకీ వికారరూపం కలిగించి, అన్నిటికీ దూరంచేసి, చిన్నవయస్సులోనే సిగ్గుఅన్నది విస్మరింపజేశారుకదా మీరంతా. నాలాంటి ఆడదాని నోటంట ఆవేదనా పూరితంగా వెలువడినమాట నీలోనే జాలికలిగించటములేదా?" అంది.

"'జాలి' అని చీదరించుకున్నాను. నీతి, పరువు వీటికన్నా గొప్పదైన అంశమా-ఏం జాలి? ఆ బురఖాను తొడగబోకు."

"'ఓహో' అని తలపరికించి ఆ నీతీ నియమాలు నాకూ తెలుసు. కాని నీ నీతేం చట్టబండలైందీ? యాభయ్యో పడి సమీపించింది."

నేను క్రోధాంధుడనైనాను. తీక్షణంగా వీక్షించాను "ఏదిక్కూలేక యీ యింట్లో చేరావన్న విషయం గుర్తుంచుకో. ఇక యీ దిక్కుకూడా నీళ్ళు వదులుకో తలచకపోతే మరి ఒక్క దుర్భాష అయినా రానీయకు."

అంతే. ఆమె ఏమీమాట్లాడలేక పోయింది. ఏడుస్తూ అక్కడినుంచి వెళ్ళిపోయింది.

(సశేషము)

కడుపునొప్పి, నోట నీరూరుట,
త్రేపులు, వాంతులు, మలబద్ధకము
లాంటి అజీర్ణ లక్షణములకు
కేసరి గారి
ఆదిత్య లవణము
దివ్య ఔషధము
వెల రు. 1-75 న.పై.
కేసరి కుటీరం ప్రైవేట్ లిమిటెడ్
మద్రాసు 14.